ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
5 జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఆగస్టు 2024



13 మంది తహసీల్దార్ల బదిలీ

కరీంనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పనిచేస్తున్న 13 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ ఎం రమేశ్‌ను చిగురుమామిడికి, చొప్పదండిలో పనిచేస్తున్న జె నరేందర్‌ను కరీంనగర్‌కు బదిలీ చేశారు. కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నవీన్‌ను చొప్పదండికి, మానకొండూర్‌లో పనిచేస్తున్న సీహెచ్ రాజును కరీంనగర్ రూరల్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న బి రాజేశ్వరికి మానకొండూర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. చిగురుమామిడి తహసీల్దార్ ఇ నరేందర్‌ను గన్నేరువరం మండలానికి బదిలీ చేశారు. గన్నేరువరం తహసీల్దార్ ఎం భిక్షపతిని గంగాధరకు, గంగాధరలో పనిచేస్తున్న జి రమేశ్‌బాబును జమ్మికుంటకు, రామడుగు తహసీల్దార్ బి భాస్కర్‌ను శంకరపట్నం మండలానికి బదిలీ చేశారు. శంకరపట్నంలో పనిచేస్తున్న జె అనుపమను హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయానికి, వెయిటింగ్‌లో ఉన్న ఆర్ వెంకటలక్ష్మికి రామడుగులో పోస్టింగ్ ఇచ్చారు. హుజూరాబాద్ తహసీల్దార్ కె విజయ్‌కుమార్‌ను తిమ్మాపూర్ మండలానికి, తిమ్మాపూర్ తహసీల్దార్ కె కనుకయ్యను హుజూరాబాద్ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

'పంచాయతీ' పోరుకు సన్నద్ధం



- గ్రామాల్లో ఎన్నికల వాతావరణం
- పట్టు సాధించేందుకు మూడు పార్టీల యత్నం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం రూపుదిద్దుకుంటున్నది. రెండు లక్షల పంట రుణ మాఫీ ఆగస్టు మాసాంతంతో పూర్తవుతుంది. స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి వచ్చే నిధులను రాబట్టుకోవాలంటే ఎన్నికలను నిర్వహించాల్సిన అవసరం ఉండడంతో ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నది. ఇప్పటికే లక్షన్నరలోపు రుణాలు మాఫీ కావడం, మిగతా రుణాలు ఆగస్టు చివరిలోగా మాఫీ కానుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై మరింత సానుకూలత పెరిగిందని అధికారపార్టీ భావిస్తున్నది. ఈ వాతావరణం స్థానిక ఎన్నికల్లో సత్ఫలితాలను ఇచ్చి అధికారంలో నిలబెడుతుందని ఆ పార్టీనేతలు బలంగా భావిస్తుండడంతో ఎన్నికలు నిర్వహించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండి ఇటీవల అధికారులతో చర్చించారు.

రిజర్వేషన్లపై సందిగ్ధం

బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసే అంశంపై బీసీ కమిషన్ ఆగస్టులోగా నివేదికను అందించాల్సి ఉన్నది. నివేదికను గడువులోగానే సమర్పించాలని ముఖ్యమంత్రి కమిషన్‌ను ఆదేశించారు. బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ఆటంకం ఏర్పడినా వాటిని అమలు చేసే విషయంలో ఆటంకాలు ఎదురైనా ఎన్నికలు ఆలస్యమయ్యే పరిస్థితి ఉత్పన్నమైతే పాత రిజర్వేషన్ల ఆధారంగానే ఎన్నికలకు వెళ్లేందుకు కూడా ప్రభుత్వం యోచిస్తున్నదని తెలిసింది. కొత్త ఓటర్ల జాబితా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని త్వరలో వస్తుందని భావిస్తున్న ప్రభుత్వం ఓటరు జాబితా అందగానే ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

పంచాయతీశాఖ నుంచి ఐదుగురు డీటీపీవోలను శిక్షణ నిమిత్తం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపించారు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ఖరారు, ఇతరత్రా విషయాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారికి శిక్షణ ఇస్తుంది. శిక్షణ పొందిన వారు జిల్లాకు తిరిగి వచ్చి జిల్లాలోని మిగతా డీటీపీవోలు, ఉద్యోగులకు శిక్షణ ఇస్తారు. జిల్లాలో 313 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ఎన్నికల్లో వీటిలో మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో కాంగ్రెస్‌కు సానుకూల వాతావరణం నెలకొన్నదని భావిస్తున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండింటిని కాంగ్రెస్, రెండింటిని బీఆర్ఎస్ గెలుచుకున్నది. ఎంపీ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. దీంతో మూడు పార్టీలు కూడా స్థానిక సంస్థలపై దృష్టిసారించాయి. గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్లను సర్పంచులను గెలిపించుకోవడం ద్వారా క్షేత్ర స్థాయిలో బలం పెంచుకొని తమ పార్టీ రాజకీయాలను ముందుకు తీసుక వెళ్తూ బలోపేతం కావాలని ఆ పార్టీ నాయకత్వాలు భావిస్తున్నాయి.

ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు నాయకుల యత్నాలు

ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో వాటికి కూడా ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇప్పటి నుంచి ఆయా పదవులపై ఔత్సాహిక అభ్యర్థులు దృష్టిసారిస్తూ ప్రజల మద్దతను కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. వరుసగా స్థానిక సంస్థల ఎన్నికల జరిగే అవకాశాలుండడంతో అన్ని పార్టీల నాయకులు ఓవైపు ఆయా పార్టీల మద్దతుతోపాటు ప్రజల ఆశీర్వాదం కోసం ప్రయత్నిస్తుండడంతో గ్రామాల్లో రోజురోజుకు రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. బోనాల పండుగ సందర్భంగా గ్రామాల్లో ఆయా పార్టీలకు చెందిన నాయకులు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి బోనాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఓవైపు ప్రభుత్వం ఓటరు జాబితాను సిద్ధం చేస్తుండగా మరోవైపు రాజకీయ పార్టీలు, నాయకులు ఎన్నికలకు సమాయత్తం అవుతుండడంతో ఎన్నికల వేడి ప్రారంభమైంది.



పాఠశాలల్లో మొక్కలు నాటాలి

కలెక్టర్ పమేలా సత్పతి



వెంకట్రావ్‌పల్లి గ్రామంలో మొక్కలను నాటుతున్న కలెక్టర్ పమేల సత్పతి

రామడుగు, ఆగస్టు 1: పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మొక్కలను నాటాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను సూచించారు. గురువారం మండలంలోని చిప్పకుర్తి, వెంకట్రావ్‌పల్లి గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలకు సంబంధించిన పలు ప్రశ్నలు వేశారు. అనంతరం రామడుగు రైతు వేదిక కార్యాలయ సమీపంలోని నర్సరీని పరిశీలించారు. అనంతరం వెంకట్రావ్‌పల్లిలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరి, మండల విద్యాధికారి వేణుకుమార్, హెచ్ఎం పద్మజ పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

- ఏళ్ల పోరాటంలో మాదిగలదే విజయం
- డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 1 : షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన శాసనసభలో మాట్లాడారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా ఏళ్లుగా మాదిగలు సాగిస్తున్న వర్గీకరణ పోరాటానికి ఇప్పుడు న్యాయం జరిగిందని, ఇది మాదిగల విజయమని అభివర్ణించారు. ఉద్యోగ నియామకాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను రాష్ట్రాలు విభజించుకునే అవకాశం ఈ తీర్పువల్ల కలిగిందన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంచి అడ్వకేట్‌ను నియమించి సుప్రీం కోర్టులో వాదనలు వినిపించడం కోసం ఢిల్లీకి పంపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అడ్వకేట్ జనరల్‌ను పిలిపించుకొని వర్గీకరణపై బలమైన వాదనలు వినిపించే విషయమై మూడు గంటల పాటు చర్చించి ఆయనతోపాటు మాదిగ ఎమ్మెల్యేలను పంపించారన్నారు. మాదిగలకు అనుకూలంగా తీర్పు వెలువడడానికి రేవంత్‌రెడ్డి చేసిన కృషి తోడైందని ఆయన పేర్కొన్నారు. మాదిగల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్న రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణకు ధన్యవాదాలు తెలిపారు.



గత బీఆర్ఎస్ ప్రభుత్వం వర్గీకరణను పక్కన పెట్టిందని, తప్పని పరిస్థితిలో అన్ని పక్షాలతో కమిటీ వేసి ఢిల్లీకి పంపిస్తామని కేసీఆర్ చెప్పి మోసం చేశారని విమర్శించారు. మాదిగ, మాల ఉప కులాల వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ తరఫున శాసనసభలో ఎమ్మెల్యే సంపత్ కుమార్ వాయిదా తీర్మానం ఇస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసిందని ఆయన గుర్తు చేశారు. అప్పుడు సీఎల్పీ లీడర్‌గా ఉన్న భట్టి విక్రమార్కను కూడా ప్రతిపక్ష నేతగా ఉండకుండా చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వం దళితులను నిర్లక్ష్యానికి గురి చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు అండ గా ఉంటోందన్నారు. దళితులైన మల్లు భట్టి విక్రమార్కను ఉప ముఖ్యమంత్రిగా, ప్రసాద్ కుమార్‌ను స్పీకర్‌గా, దామోదర రాజనర్సింహను మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను విప్‌గా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. ఇందిరమ్మ పాలన నుంచి మాదిగలు కాంగ్రెస్‌కు అండగా ఉంటారన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలోనైనా ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రాక పోవడం ఆయన దొర అహంకారానికి నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ విమర్శించారు. శాసనసభలో మాదిగల ఎమ్మెల్యేలు మాట్లాడితే వినాల్సి వస్తుందన్న దొరతనపు అహంకారం, నిర్లక్ష్యంతో వారు వాకౌట్ చేశారని విమర్శించారు. మాదిగ వర్గీకరణపై మాట్లాడ కుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల ఎదుట చావు డప్పు కొట్టాలని ఆయన మాదిగలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందని, వర్గీకరణ పై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ వర్గీకరణ సాధనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి ప్రభుత్వాసుపత్రి కార్మికుల సమ్మె

సుభాష్‌నగర్, ఆగస్టు 1: పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి శానిటేషన్, పేషంట్ కేర్ కార్మికులు, సెక్యూరిటీ గార్డ్స్ గురువారం నుంచి సమ్మె చేయనున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, ఈపీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలని, కార్మికులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెలోకి వెళతామని ఇప్పటికే నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. తప్పని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళుతున్నామని ఆయన చెప్పారు.

ఒక్క క్షణం.. ఆలోచించండి

- రెండు రోజుల్లో ఇద్దరు యువతుల ఆత్మహత్య
- క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో జీవితాలు బలి
- సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు అండగా ఉండాలంటున్న నిపుణులు



కరీంనగర్ క్రైం, ఆగస్టు 1 : ఒక్కగానొక్క కూతురును వైద్యురాలిగా చూడాలని తల్లిదండ్రులు ఎన్నో కలలు కన్నారు. కాని ఆ యువతి చదువులో ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడటంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది. కరీంనగర్‌లోని ఒక వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యానగర్‌కు చెందిన కోమళ్ల శిరీష (20) జూలై 27న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మరో 3 రోజుల్లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్షలుండడంతో ఒత్తిడిని భరించలేక శిరీష ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చదువు తననుంచి కావడం లేదని తల్లిదండ్రుల వద్ద తరచుగా బాధపడిన శిరీష్‌ను తల్లిదండ్రులు ఓదార్చుతూ భవిష్యత్ బాగుంటుందని సర్దిచెప్పేవారు. తరగతులుముగిసిన అనంతరం స్నేహితులతో కలిసి ఇంటికి ఆత్మహత్యకు పాల్పడింది.

- తన పెళ్లికి అప్పుగా డబ్బులు దొరకడంలేదని మనస్తాపం చెందిన ధరణి (20 అనే యువతి బోయవాడలో జూలై 28న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. 3 నెలల కిందటే పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి ఖర్చుల కోసం డబ్బులు సర్దుబాటు కాలేదు. తండ్రి లేకపోవడంతో తల్లి, సోదరుల ప్రయత్నాలు ప్రత్యక్షంగా చూసిన ధరణి మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

కరీంనగర్‌లో వరుసగా రెండు రోజుల్లో ఎంబీబీఎస్, డిగ్రీ చదువుతున్న ఇద్దరు యువతులు బలవన్మరణానికి పాల్పడడం కన్నవారికి కడుపుకోతను మిగిల్చింది. ఇలా జిల్లాలో రోజుకో ఘటన జరుగుతూనే ఉంది. అప్పులబాధతో రైతులు, కుటుంబ కలహాలతో భార్య, భర్తలు, చదువు ఒత్తిడితో విద్యార్థులు, ఉపాధి, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, ప్రేమ, పెళ్లి మోసాలు తదితర సమస్యలతో క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతూ వారి ఉజ్వల భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు.

చావే సమస్యకు పరిష్కారం కాదు..



జీవితంలో ఎదురైన సమస్యలను మనోధైర్యంతో ఎదుర్కొన్నప్పుడే విజయం సాధ్యమవుతుంది. గమ్యం వేరు.. కల వేరు. కల చాలా బాగుంటుంది.. కాని గమ్యం కఠినంగా ఉంటుంది. ప్రతి వ్యక్తి ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని విధించుకుని దానిని చేరుకునే ప్రయత్నం చేయాలి. తాను ఎలాగైనా గమ్యం చేరకుంటా ననే నమ్మకం, సంకల్పం ఉండాలి, లక్ష్యాన్ని సాధించి తీరుతాననే పట్టుదల ఉంటే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదు. సమస్యను చూడగానే చాలా మంది దానిని ఎలా పరిష్కరించాలనే ఆలోచన చేయకుండా, కనీ సం ప్రయత్నం చేయకుండా ఆ సమస్య నుంచి పూర్తిగా పారిపోయే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు లేని పోని ఆలోచనలతో, ఆవేదనతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను మరింతగా పెంచుకుంటున్నారు. సమస్య రాగానే నాకే ఎందుకిలా జరగాలి.. నేనేం తప్పుచేశాను.. వంటి ఆలోచనలు మనిషిని మరింత కుంగదీస్తాయి. సమస్య వచ్చినప్పుడు దిగులు చెందితే పరిష్కారం దొరకదు. సమస్య నుంచి బయట పడడానికి, సమస్య తీవ్రతను తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. ప్రస్తుతం యువత సమస్య పరిష్కారాన్ని వదిలేసి జీవితాన్ని అంతం చేసుకుంటున్నది. ప్రతి వ్యక్తి జీవితంలో ఏదో ఒక విషయంలో సర్దుబాటు అనేది తప్పనిసరి. ప్రతీది మనం అనుకున్నట్లే జరగాలనుకుంటే సాధ్యమయ్యే పనికాదు. ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకున్నప్పుడు విజయంగా స్వీకరించాలి. ఓడినప్పుడు పాఠాన్ని నేర్చుకోవాలి. మొత్తంగా జీవితంలో గెలుపోటములు సహజ మన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ విషయాన్ని మరిచిపోవడం వల్లే జిల్లాలో కొంత మంది యువతీ యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చిన్న కారణాలతో యువత భావోద్వేగాలు అదుపులో పెట్టుకోలేక తీసుకుంటున్న నిర్ణయాల వల్ల వారి కుటుంబాలు తీరని వేదనను అనుభవిస్తున్నాయి.

అండగా నిలిచేవారు లేక..

నేటి ఆధునిక సమాజంలో ప్రజల జీవన విధాన మారింది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయి. గతంలో సమస్యలు వస్తే కుటుంబ సభ్యులు అందరూ ఒక చోట కూర్చుండి సమస్యపై చర్చించుకుని, పరిష్కరించుకునేవారు. ఒకరి బాధను మరొకరు పంచుకునేవారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తిన సందర్భంలో వారికి సర్ది చెప్పేవారు లేకుండా పోయారు. కుటుంబంలో ఎవరైనా అన్యమనస్కంగా ఉన్నా, ఆందోళనతో ఉన్నా మిగతా వారు గమనించి వారితో చర్చించి అండగా నిలిస్తే సమస్యలు పరిష్కరించవచ్చని మానసిక నిపుణులు అంటున్నారు.

రెండో విడత దళితబంధు విడుదల చేయాలి

హుజూరాబాద్‌లో లబ్ధిదారుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న దళితబంధు రెండో విడత సాధన సమితి సభ్యులు

హుజూరాబాద్, ఆగస్టు 1: దళితబంధు రెండో విడత డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద లబ్ధిదారులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బంధు రెండో విడత సాధన సమితి నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దళిత బంధు లబ్ధిదారులకు సగం డబ్బులు మాత్రమే మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దళితబంధు రెండో విడత డబ్బులను విడుదల చేయాలన్నారు. లేకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. గంటపాటు రాస్తారోకో చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి రాస్తారోకో చేస్తున్న లబ్ధిదారులను అదుపులోకి తీసుకున్నారు.

నగరంలో భారీ వర్షం

- రోడ్లు జలమయం
- ఇబ్బందులుపడ్డ వాహనదారులు





కరీంనగర్ టౌన్, ఆగస్టు 1: నగరంలో గురువారం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం వరకు పొడి వాతావరణం ఉంది. సాయంత్రం 5 గంటల నుంచి దాదాపు గంటన్నరసేపు కురిసిన భారీ వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులతోపాటు వీధుల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి రోడ్లపై నిలిచిన మురుగునీరు, వరద నీటిని వర్షంలోనే డ్రైనేజీల్లోకి మళ్లించారు. పదిహేను రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ గురువారం భారీ వర్షం కురిసింది. పట్టణ ప్రగతి, సీఎం హామీ నిధులతో పలు చోట్ల రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించి మధ్యలోనే పనులు నిలిపి వేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వర్షంతో ఇబ్బంది పడ్డారు. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరా కొద్దిసేపు నిలిచి పోయింది.



డ్రైనేజీల వద్ద ఇరుక్కుపోయిన చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు



నగరంలో కురుస్తున్న వర్షం

కొండగట్టు ఈవోగా రామకృష్ణ



నూతన ఈవోకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

మల్యాల, ఆగస్టు 1: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన ఎం.రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. దేవాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఈవోగా నియమితులైన అనంతరం కొండపైకి వచ్చిన ఆయన మొదట స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఈవోకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ప్రస్తుతం ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్ నుంచి పూర్తిస్థాయి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు నూతన ఈవోను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, సీనియర్ అసిస్టెంట్‌లు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, రాజేశ్వర్‌రావు, లతాదేవి, లక్ష్మారెడ్డి, ధర్మేందర్, శ్రీనివాస్, లక్ష్మిరాజం, సంపత్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

వాహన త్రైమాసిక పన్నుల బకాయిలు చెల్లించాలి : డీటీసీ

తిమ్మాపూర్, ఆగస్టు1: వాహనాల యాజమానులు త్రైమాసిక పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ పి.పురుషోత్తం కోరారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బైపాస్‌లోని లారీ ఓనర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ప్రచార వాహనాన్ని డిటిసి పురుషోత్తం జెండా ఊపి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమసిక పన్ను బకాయిలు నిర్ణీత సమయంలో చెలించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే 200శాతం అపరాధ రుసుముతో పాటు వాహనం జప్తు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనదారులు త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రచారం చేసేందుకు ప్రచార వాహనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రచార రథం జిల్లాలోని అన్ని మండలాలలో తిరుగుతూ సకాలంలో పన్నులు చెల్లించాలని ప్రచారం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా వాహనదారులు బకాయిగా ఉన్న త్రైమసిక పన్నుల బకాయిలు చెల్లించాలని డిటిసి పురుషోత్తం కోరారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్ చక్రవర్తి, రవి కుమార్, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్, కానిస్టేబుల్స్, హోంగార్డులు, లారీ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది రమేష్, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ నేత కార్మికుడి మృతి

గంగాధర, ఆగస్టు 1: చికిత్స పొందుతూ నేత కార్మికుడు మృతి చెందినట్లు ఏఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రామడుగు మండలం షానగర్‌కు చెందిన మిట్టపల్లి రమేష్(45) ఇంటి వద్ద సాంచాలు నడుపుతూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గంగాధర మండలం కురిక్యాల శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న ర మేష్‌ను స్థానికులు గమణించి 108 సమాచారం అందించగా కరీంనగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యుల సూచనల మేరకు నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మిట్టపల్లి నరేష్ "ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

రూ.7,200 పలికిన పత్తి ధర

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,200 పలికింది. గురువారం ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,200, కనిష్ఠ ధర రూ.7,100 చెల్లించి కొనుగోళ్ల చేపట్టారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్లు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.



కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు



కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ


» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.







కొనసాగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం ఎగువ ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు 8,234 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5,813 క్యూసెక్కులు వస్తుండగా, కడెం ప్రాజెక్టు నుంచి 2421క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.084 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ నుంచి 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 5.630 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు.



గాయత్రి పంప్ హౌస్ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గాయత్రి పంప్‌హౌస్‌ను సందర్శించిన కలెక్టర్

రామడుగు : మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఆరవ రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 కూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇప్పటి వరకు 5.5 టీఎంసీల నీరు మిడ్ మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పంప్‌హౌస్‌ను గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీటిని పరిశీలించిన అనంతరం అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంపుల సామర్థ్యం, విద్యుత్తు వినియోగం, నీటి విడుదల వివరాలను అడిగారు. డీఈఈ రాంప్రదీప్ కలెక్టర్‌కు పలు వివరాలను వెల్లడించారు. మొత్తం 4, 5 పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నామని తెలిపారు. ఒక్కో పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఒక రోజుకి ఎత్తిపోస్తున్నామన్నారు. ఒక్కొక్క పంపుకు 139 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎత్తిపోతలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. గాయత్రి పంప్‌హౌస్‌ప్రాంతాన్ని విజ్ఞాన విహారకేంద్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా విహార కేంద్రంగా ఏర్పాటు చేయటం ద్వారా సెక్యూరిటీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ప్రాజెక్ట్ గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. అనంతరం పంప్‌హౌస్ ప్రాంతంలో కలెక్టర్ మొక్కలను నాటారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12వేల 600 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 310.22ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 11.68 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎస్సారెస్పీలోకి 50 వేల క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీటి రాక భారీగా పెరిగింది. మహారాష్ట్రలోని అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండడం వల్ల అక్కడి నుంచి వదులుతున్న నీరు ఎస్సారెస్పీలోకి వస్తోంది. బాబ్లీ ప్రాజెక్టు పైన గల బాలేగావ్ ప్రాజెక్టుకు చెందిన నాలుగు వరద గేట్లను ఎత్తి దిగువకు నీరు వదు లుతున్నారు. గత నెల 31వ తేదీ రాత్రి 9 గంటలకు 11 వేల క్యూసెక్కులను బాలేగావ్ ప్రాజెక్టు నుంచి దిగువకు వదలడం ప్రారంభించగా ఈ నెల 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి సుమారు 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బాలేగావ్ నుంచి బాబ్లీ ప్రాజె క్టులోకి వస్తున్న నీరు బాబ్లీ గేట్లు తెరిచి ఉండడం వల్ల నేరుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తున్నాయి. గురువారం రాత్రి 8 గంటల వరకు సుమారు 50 వేల క్యూసెక్కుల కుపైగా వరద నీరు ఎస్సారెస్పీలోకి వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 37.113 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.579 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

13 మంది సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 1: కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పలువురు సీఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు గురువారం మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా పనిచేస్తున్న జి తిరుమల్ హుజురాబాద్ సీఐగా బదిలీ అయ్యారు. హుజూరాబాద్ సీఐగా పనిచేస్తున్న బి రమేష్ కరీంనగర్ సీసీఎస్ సీఐగా బదిలీ చేశారు. అలాగే ఆసిఫాబాద్ జిల్లా వాంఖిడి సీఐ బి శ్రీనివాస్ కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా, రాజన్న సిరిసిల్ల జిల్లా సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న కె ప్రవీణ్‌కుమార్‌ను పెద్దపల్లి సీఐగా, పెద్దపల్లి సీఐగా పనిచేస్తున్న ఆర్ కృష్ణ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. మల్టీజోన్-1లో మొత్తం 13 మంది సీఐలకు బదిలీలు జరిగాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గంగాధర, ఆగస్టు 1: మండలంలోని వెంకటయ్యపల్లిలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఒకరు మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుండు అంజయ్య(40) గ్రామంలో గురువారం డిష్ కేబుల్‌ను అమర్చుతున్నాడు. దారి పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసి వైరు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుతాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

సుభాష్‌నగర్, ఆగస్టు 1: జిల్లా కేంద్రంలోని ఆదర్శ ఆసుపత్రిలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందిరానగర్‌లోగల పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అనిల్‌కుమార్, యూరాలజిస్టు డాక్టర్ హృదయ్‌కుమార్ రిటైర్డ్ ఉద్యోగులను ఈసీజీ, సీబీపీ, ఆర్‌బిఎస్, క్రియాటినైన్, జనరల్ చెకప్ ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కరివెద సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలు మరిన్ని నిర్వహించి ప్రజలు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు.

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వేణుమాధవ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు1: నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా వేణుమాధవ్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన వేణుమాధవ్‌ను ఇక్కడికి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. దీనితో ఆయన గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లిన వేణుమాధవ్, ఆ తర్వాత సుల్తానాబాద్‌కు బదిలీ అయి తిరిగి అక్కడి నుంచి మళ్లీ అసిస్టెంట్ కమిషనర్‌గా వచ్చారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 1: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ఎస్ఓఎఫ్ అంతర్జాతీయ జనరల్ నాలెడ్జ్ ఒలంపియాడ్‌లో నగదు బహుమతులు గెలుచుకున్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయిన ఎస్ఓఎఫ్ నిర్వహించిన జనరల్ నాలెడ్జ్‌పరీక్షల్లో డి స్తుతి, యశ్వంత్‌క్రిష్ణ, మాజ్‌హుసేన్, బికార్తికేయలు నగదు బహుమతులు గెలుచుకోవడం అభినందనీయమన్నారు.

డెంగ్యూపై అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 1: నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ బాలికల ఈ-టెక్నో స్కూల్‌లో సైన్స్ విభాగం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు డెంగ్యూపై అవగాహన సదస్సును నిర్వహించారు. అల్ఫోర్స్ అధినేత వి.నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డెంగ్యూ అవగాహన పోస్టర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు.

'ప్రతి విద్యార్థి స్కౌట్ శిక్షణ తీసుకోవాలి'

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు1: ప్రతి విద్యార్థి స్కౌట్స్ గైడ్స్ శిక్షణ తప్పకుండా తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రపంచ స్కౌట్స్ కార్ఫ్‌డే వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ ఓపెన్ స్కౌట్ ట్రూప్ స్కౌట్స్ మాస్టర్ గంగారపు మల్లేశం, ఘాన్సీ లక్ష్మీబాయి గైడ్ కెప్టెన్ గంగారపు సుమలత ఆధ్వర్యంలో రేకుర్తిలోని విజన్ స్కూల్‌లో స్కౌట్స్, గౌడ్స్ విద్యార్థులు సర్వ ధర్మ ప్రార్థనలు చేసి, కొత్త విద్యార్థులను వివిధ పాఠశాలల్లో నుంచి స్కౌట్స్, గైడ్స్ విద్యా ఉద్యమంలో చేర్పించి శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో విజన్ స్కూల్ డైరెక్టర్ మల్లయ్య, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ స్కౌట్స్ స్కార్ఫ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ బార్డెన్ పావెల్ చిత్రపటానికి పూల మాల వేసి స్కౌట్స్ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఈ.ప్రసాద్‌రావు, కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు లాక్కోవద్దు

జమ్మికుంట, ఆగస్టు 1: పేద ప్రజలకు ఇచ్చిన నివేశన స్థలాలను లాక్కోవడం సరికాదని బీజేపీ పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ అన్నారు. గురువారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆటోనగర్‌ను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో 2007సంవత్సరంలో 371 మంది నిరు పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఆ సమయంలో కొంత మంది ఇళ్లు నిర్మించుకున్నారని, మరికొంత మంది నిర్మించుకోలేదని, వాటిని మున్సిపల్ అధికారులు అక్రమంగా ఆక్రమించుకుని చెత్త వేస్తున్నారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, నాయకులు పల్లపు రవి, కైలాస్‌కోటి గణేష్, అప్పం మధు, మోతె స్వామి, స్వరూప, సుధాకర్‌రెడ్డి, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

బీజేపీ శాసనసభాపక్షనేతను కలిసిన నాయకులు

రామడుగు, ఆగస్టు 1: హైద్రాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో బీజేపీ శాసన సభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేలక ప్రభాకర్‌యాదవ్, రామడుగు మండల బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలో నూతన బ్రిడ్జి ప్రారంభం గురించి అసెంబ్లీలో చర్చించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు రామ్ కిషన్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, మోడీ రవీందర్, మాడిశెట్టి జయంత్‌లు ఉన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

మానకొండూర్, ఆగస్టు 1: హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ అధికారులకు సూచించారు. మండలంలోని మానకొండూర్‌లో సమీకృత హాస్టల్, శ్రీనివాసనగర్‌లోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టోర్‌రూం, వంటగదులను పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను మరమ్మతులు చేపట్టి, కిటికీలకు దోమతెరలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసుదనాచారి, వార్డెన్లు, ప్రత్యేకాధికారి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



కీర్తి ధన్యశ్రీని అభినందిస్తున్న నేదురు తిరుపతి

తిమ్మాపూర్, ఆగస్టు1: స్థానిక ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కీర్తి ధన్యశ్రీ రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు ఎస్ఆర్ జూనియర్ కళాశాలల కరీంనగర్ జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. హైదారాబాద్‌లోని జీఎంసీ బాల యోగి స్టేడియంలో జరిగిన తెలంగాణ 9వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా స్విమ్మింగ్ చాంపియన్ షిప్ -2024 పోటీల్లో గ్రూప్-1 విభాగంలో 1500 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కీర్తి ధన్యశ్రీ పాల్గొని ప్రతిభ చూపి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని కీర్తి ధన్యశ్రీని ఎస్ఆర్ జూనియర్ కళాశాల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు బాగు చేయాలని బీజేపీ నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

రామడుగు, ఆగస్టు 1: గోపాల్‌రావుపేట నుంచి బూరుగుపల్లికి వెళ్లే ప్రధాన రహదారి బాగుచేయాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం ప్రధాన రహదారిపై గుంతల్లో నాట్లు వేస్తూ నిరసన తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి పోచంపల్లి నరేష్, ఉపాధ్యక్షుడు కళ్లెం శివ, యువ మోర్చా మండల ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్, బూత్ కమిటీ అధ్యక్షులు పల్లపు చిరంజీవి ఉన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆగస్టు 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి అధికారులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహ ణకు గ్రామ స్థాయిలో, మున్సిపల్ వార్డు స్థాయిలో ప్రత్యేక బృందాలను కలెక్టర్ నియమించాలని అన్నారు. 5న ప్రజలు, ప్రజాప్రతినిధులను సమన్వయ పరుచు కొని చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశాలను నిర్వహించాలన్నారు. 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, ఆగస్టు 7న నీరు నిల్వ ఉండే ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 8న సీజనల్ వ్యాధుల నియం త్రణపై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలను చేపట్టాలన్నారు. 9న డ్రైడే కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఇన్స్టిట్యూషన్ ల, పబ్లిక్ స్థలాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. ఇకపై ప్రతి నెలలో 3వ శనివారం స్వచ్ఛదనం- పచ్చదనం దినంగా నిర్వహిస్తామని సీఎస్ పేర్కొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ పమేలా సత్పతి అధికారులతో సమీక్షించి దిశానిర్దేశనం చేశారు. మొక్కలను కచ్చితంగా నాటేలా చూడాలని, ఎక్కువగా మునగ, నిమ్మ, బొప్పాయి, మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్డిఓ శ్రీధర్, డీఎఫ్ఓ, డిపిఓ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు సెయింట్‌జార్జ్ విద్యార్థుల ఎంపిక

భగత్‌నగర్, ఆగస్టు1: కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన శ్రీదీక్షిత్, మణినందన్, విశ్వక్‌సేనలను పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి అభినందించారు. ఆల్‌ఇండియా నేషనల్ చాంపియన్-2024, యూత్, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఆరుగురు పాల్గొనగా ముగ్గురు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

సెప్టెంబర్ 9 నుండి 11 వరకు గోవాలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. క్రికెట్ కోచ్ సాయినాథ్‌ను అభినందించారు. డిల్లీలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సాత్విక్, మహిమాన్విత్, శ్రీనాథ్‌లను అభినందించారు.

'ఎస్సారార్' ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ

గణేశ్‌నగర్, ఆగస్టు 1: శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ యాంసాని సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వరలక్ష్మి

గణేశ్‌నగర్, ఆగస్టు 1: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్‌గా టి.వరలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వరలక్ష్మి ఇంతకు ముందు నాంపల్లి హైదరాబాద్‌లో బాధ్యతలు నిర్వహించారు.

తల్లిపాల వారోత్సవాలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు1: మండలంలో పలు గ్రామాల్లో తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో బాగంగా గురువారం దుర్శేడ్ గ్రామంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యను వివరించుకుంటూ పుట్టిన బిడ్డకు 6నెలల వరకు తల్లి పాలను పట్టాలని సూచించారు. తరువాత తల్లి పాలను ఇస్తు అదనపు ఆహారం ఇవ్వాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్‌లు అనిత, అంగన్ వాడీ టీచర్‌లు బి పద్మశ్రీ,ఈ రాజేశ్వరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 1: చెట్లు సమృద్ధిగా ఉంటేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని కాపాడాలని సర్వోదయ సేవా సమితి అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మొక్కలు నాటారు. చెట్లను నరికి వేయకుండా కాపాడగలిగితేనే జీవకోటికి మనుగడ ఉంటుందని పర్యావరణవేత్త తోట లక్ష్మన్‌రావు అన్నారు.

ఈకార్యక్రమంలో సర్వోదయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి సామ నారాయణ, ఉపాధ్యక్షుడు పాత వెంకట నర్సయ్య, సభ్యులు గాదె నీలకంఠం, జోగినపల్లి రఘునందన్ రావు, పాఠశాల కమిటీ చైర్మన్ బల్మూరి కరుణాకర్‌రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సముద్రాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సహకారాన్ని అందిస్తాం'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 1: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలో ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ఆటో యూనియన్ జెండాను యూనియన్ గౌరవ అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజేందర్, బీఆర్ఎస్ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు రాంచంద్రం, లీగల్ అడ్వయిజర్ రాజేశం, కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, సాగర్ పాల్గొన్నారు.

●**కరీంనగర్ క్రైం:** ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మంచిర్యాల చౌరస్తాలోని లోకల్ ఆటో స్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చలిమెల రాంచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

●**గణేష్‌నగర్:** నగరంలోని అడ్డా నెంబర్ 2 అధ్యక్షుడు అనంతగిరి సంపత్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, అంతగిరి సంపత్, సోల్లేటి అంజనేయులు, మారం సంపత్ పాల్గొన్నారు.

సీఎం క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఆందోళన



కరీంనగర్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గణేశ్‌నగర్, ఆగస్టు 1: అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో మహిళా నాయకురాళ్లు కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో సీఎం దిష్టి బొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, నగర మైనార్టీ అధ్యక్షులు షౌకత్, నగర మైనార్టీ ప్రధాన కార్యదర్శి వాజిద్, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

●**మానకొండూర్:** సీఎం క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. పల్లెమీద బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా సీఐ సదన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకొని దిష్టిబొమ్మను ప్రక్కకు తీసుకెళ్లారు. దీంతో పోలీసులకు బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, ఇల్లంతకుంట మాజీ జడ్పీటీసీ సిద్దం వేణు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

●**గంగాధర:** గంగాధరలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, మాజీ సర్పంచ్‌లు దామోదర్, నజీర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహిపాల్‌రావు, గంగాధర్ పాల్గొన్నారు.

'ఎంబీ రికార్డుల మాయంపై విచారణ జరిపించాలి'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 1: నగర పాలక సంస్థ పరిధిలో చేపడు తున్న అభివృద్ధి పనుల అవినీతి బయటపడకుండా ఆయా పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్స్ (ఎంబీ) రికార్డులను మాయం చేస్తున్నారని, దీనిపై విజిలెన్సు విచారణ జరిపించాలని కార్పొరేటర్లు మెండి శ్రీలత చంద్రశేఖర్, బండారి వేణు వేర్వేరుగా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం సమర్పించారు. కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి సంబంధించిన ఎంబి నెంబర్ 152ను మాయం చేశారన్నారు. సమీకృత మార్కెట్ భవన నిర్మాణ సమయంలో అక్కడ రాక్ కటింగ్ చేసినట్లు ఎంబీ రికార్డు చేసి 80 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు పక్కా సమాచారముందని, ఇందుకు సంబంధించిన బిల్లు చెల్లింపు ఎంబీ రికార్డును చూపించకుండా కేవలం ఎస్టిమేట్ చేసిన 1,99,468 మాత్రమే చెల్లించినట్లు బదిలీపై వెళ్తున్న ఓ ఏఈతో ప్రకటన ఇప్పించారని ఆరోపించారు. ఇప్పటికైనా దీనిపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లతో పాటు కొమ్ముకాసిన ప్రజాప్రతినిధులపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు



కరీంనగర్‌లో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం



హుజూరాబాద్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గణేశ్‌నగర్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై కరీంనగర్ గీతాభవన్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు చేపట్టారు. కార్యక్రమంలో బెజ్జంకి అనిల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దండు అంజయ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి కొత్తూరి రాజన్న మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు చెంచాల నవీన్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తాండ్ర శంకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

●ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● సుభాష్‌నగర్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పు సామాజిక న్యాయాన్ని నిలబెట్టిందని ప్రజా సంఘాల జాతీయ నాయకుడు పోలాడి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ప్రజా సంఘాల నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు శ్రీనివాస్, రామచంద్రం, వసంత్, రత్నం, శేఖర్, సదానందం, వెంకటరాజం, ప్రభాకర్ పాల్గొన్నారు.

● వీణవంక: సుప్రీంకోర్టు తీర్పుపై మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు ఇంజం వెంకట స్వామి,రేణికుంట్ల సాగర్, అంబాల మధునయ్య, మేరే అరుణ్,వంతడుపుల సంపత్,పర్లపల్లి తిరుపతి ఉన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

● ఇల్లందకుంట: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి స్వామి, సమ్మయ్య, రవీందర్, తారక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలుగా చేసిన పోరాటాలు సుప్రీకోర్టు సానుకూల తీర్పుతో ఫలించాయని బహుజన యాది సభ సంఘాల వ్యవస్థాపకులు డాక్టర్ నలిగంటి శరత్ చమార్, ద్రావిడ సాహిత సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు రామంచ భరత్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● రామడుగు: మండలంలోని తిరుమలాపూర్‌లో ఎస్సీఎస్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తడగొండ సత్యరాజు వర్మ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్, రాజు, అజయ్ తదితరులు ఉన్నారు.

● మానకొండూర్ : ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం వెలువరించిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కోండ్ర శంకర్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు.



శంకరపట్నంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

కరెంటు మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి

సైదాపూర్, ఆగస్టు 1: రైతులు కరెంటు మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని ఏఈ ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన సైదాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బొత్తలపల్లి శివారులోని బావుల వద్దకు వెళ్లి కరెంటు మోటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు కెపాసిటర్ల వాడకంపై అవగాహన కల్పించారు. 3హెచ్‌పీ మోటార్‌కు 1కేవీఏఆర్, 5హెచ్‌పీ మోటార్‌కు 2కేవీఏఆర్, 7.5హెచ్‌పీ మోటార్‌కు 3కేవీఏఆర్ రేటింగ్ కెపాసిటర్‌లు అమర్చుకోవాలన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టుకు నిధుల మంజూరుపై హర్షం

సైదాపూర్, ఆగస్టు 1: గౌరవెల్లి ప్రాజెక్టుకు నిధుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలుపడంపై హర్షం వ్యక్తం చేస్తూ సైదాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్ మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.431.30 కోట్లు విడుదలకు కేబినెట్ ఆమోదం తెలుపడం సంతోషించదగ్గ విషయమన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చాడ కొండాల్‌రెడ్డి, సంతోష్, వెంకటేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కరీంనగర్ రూరల్, ఆగస్టు1: మండల పరిషత్‌లో గురువారం ఆయా గ్రామాల కార్యదర్శులకు, ఆశవర్కర్‌లకు, ఎన్ఎంలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ సంజీవరావు, ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ మనోహర్‌లు వారికి అవగాహన కల్పించారు. అవసరమైతే జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఎఎన్ఎమ్‌లు, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఈవోగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు1: నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వ రాలయ రెగ్యులర్ కార్య నిర్వహణాధికారిగా కె సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఈఓ వుడుతల వెంకన్న నుంచి ఆయన ఛార్జి తీసుకున్నారు. సుధాకర్ ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయ ఇంచార్జ్ ఈఓగా కొనసాగనున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ఛైర్మన్‌లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

రచయిత చేతన్‌గౌడ్‌కు సత్కారం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 1: స్థానిక మంకమ్మతోటకు చెందిన యువ రచయిత పొన్నం చేతన్‌గౌడ్‌కు గురువారం జస్టిస్ కుమారయ్య కళాశాల అడ్వకేట్ బృందం సత్కారం చేసింది. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత, న్యాయవాది ఏ కిరణ్‌కుమార్, రచయిత తల్లిదండ్రులు పొన్నం రజిత-శ్రీధర్‌గౌడ్, అడ్వకేట్ మిత్ర బృందం సభ్యులు మంథెన సురేశ్‌కుమార్, బొంకూరి మోహన్, మడిపెల్లి వినీత్‌కుమార్, ఎన్నం మమత పాల్గొన్నారు.

పొన్నం రవిచంద్రకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 1: జిల్లాకు చెందిన కఫిసో అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు, రచయిత, సినీ విమర్శకుడు పొన్నం రవిచంద్ర లండన్‌కు వెళ్లిన సందర్భంగా గురువారం లండన్ తెలుగు సమాజం, తెలుగు అసోసియేషన్ ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుధాకర్ రంగుల, జీవనమౌనిక, మాచర్ల ప్రవీణ్, వేముల వివేక్, వరాల అభినవ్, పి సాత్విక్, విపుల్‌గౌడ్, నరేశ్ మర్యాల, సందేశ్ భోంగిర్వార్, శ్రీకాంత్ సాధు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, ఆగస్టు1: కరీంనగర్ మండలం చామనపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో దుర్శేడ్, గోపాల్‌పూర్, చామనపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్శేడ్ గ్రామంలో ఇద్దరికి డెంగ్యూ నిర్ధారణ కాగా మండలంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈకార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కరీంనగర్ రూరల్, ఆగస్టు1: మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కామిరెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 1: జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు, సౌకర్యాలు అందుబాటులో ఉండాలని తెలంగాణ రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు బామండ్ల రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చడం తగదు

సుభాష్‌నగర్, ఆగస్టు 1: ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలో చేర్చడం తగదని తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడప కోటేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం గంగపుత్ర సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అంధ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 1: నగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వారాల లావణ్యనర్సింగం పటేల్ దుస్తులను పంపిణీ చేశారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యానగర్, హరిహరనగర్, కొత్తయాస్వాడకు చెందిన ప్రతినిధుల చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు.

మరమగ్గాల కార్మికుల వంటావార్పు

గంగాధర, ఆగస్టు 1: గర్శకుర్తి మరమగ్గాల కార్మికులు గురువారం వంటావార్పు చేసి నిరసన తెలిపారు. పవర్ లూమ్స్ వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు అందించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు.

రేపు ఇసుక వేలం

గంగాధర, జూలై1: గంగాధర తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఇసుకను ఈ నెల 3న వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వెయ్యి రూపా యల ధరావత్తు చెల్లించి ఈ నెల 3న 11 గంటలకు నిర్వ హించే వేలంలో పాల్గొనాలని తెలిపారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

శంకరపట్నం, ఆగస్టు 1: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో పొద్దుటూరి రామయ్యకు చెందిన ఆస్తిని తప్పుడు ధ్రువపత్రాలతో వేరొకరికి పట్టా మార్పిడి చేశారని శంకరపట్నం తహసీల్దార్‌పై జిల్లా కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేసినట్లు యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోరె గణేష్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

సైదాపూర్, ఆగస్టు 1: సైదాపూర్‌లో 26 గ్రామ పంచాయతీలు ఉండగా 26 మంది కార్యదర్శులు బదిలీ అయ్యారు.వారం రోజుల క్రితం ఐదుగురు కార్యదర్శులు బదిలీ కాగా గురువారం మిగతా 21 మంది బదిలీ అయినట్లు ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో సురేందర్ తెలిపారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 1: హుజూరాబాద్- జమ్మికుంట రూట్‌లో బస్సులకు గ్రామాల వారీగా హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని శాలపల్లి ప్రజలు గురువారం డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేత్రదానంపై అవగాహన

జమ్మికుంట రూరల్, ఆగస్టు 1: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన బెజగం చంద్రమౌళి సంస్మరణ సభ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం, అవయవదానాలపై అవగాహన కల్పించారు. చంద్రమౌళి నేత్రాలు మరో ఇద్దరి చూపు ఇచ్చాయన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

వీణవంక, ఆగస్టు 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసులు మత్తు పదార్థాలపై గురువారం అవగాహన కల్పించారు. జమ్మికుంట రూరల్ సీఐ కోరే కిషోర్ తదితరులు ఉన్నారు.

కార్యదర్శిని నియమించాలి

మానకొండూర్, ఆగస్టు 1 : మానకొండూర్ గ్రామానికి పర్మినెంట్ పంచాయతీ కార్యదర్శిని ఏర్పాటు చేయాలని గ్రామ మాజీ ఎంపీటీసీ గోశెట్టి సత్యనారాయణ జిల్లా కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు.

కాట్నపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

చొప్పదండి, ఆగస్టు 1: మండలంలోని కాట్నపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలు, పోషక ఆహారం, అదనపు ఆహారం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.